# పురుగు

అమరయ్య తెల్లవారుజామున అయిదు గంటలకల్లా నిద్ర లేచాడనటం కన్నా పక్క మీద నుంచి లేచి కూర్చున్నాడనటం నిజం. అసలు కంటిమీద కునుకనేది ఉంటే కదా నిద్ర లేవటం? బ్రతుకే కలత నిద్రైపోయింది.



నడిమంచం మీద కూర్చుని మోకాళ్లు చేతుల మధ్య ఇరికించుకొని కొయ్యబొమ్మలా కూర్చున్న భర్తను అప్పుడే నిద్ర లేచిన రాజమ్మ కళ్లు నులుముకుంటూ చూసింది. అతనికేసి చూస్తూనే గ్రహించింది, అతనేదో దీర్ఘంగా ఆలోచిస్తూ వున్నాడని. కొద్ది రోజులుగా ఇదే ధోరణి.

కాస్త మదుగ్గా చాపమీద నడుం వాల్చే రాజమ్మకు, భర్త మంచం పక్కనే పెట్టిన కిరసనాయిలు దీపం అతని నీడను గోడమీద చూపెడుతూనే వుంటుంది. ఆమెకు మెలకువ వచ్చినప్పుడల్లా కొయ్యగుంజ నీడలో కలిసిపోయి నిశ్చలంగా ఉండే భర్త ఆకారమో, నిద్రకోసం పొర్లిగింతలు పెడుతుండే భర్త ఆకారమో నీడలా కనిపిస్తూనే వుంటుంది.

ఏ రకమైన బాధలు, బరువు బాధ్యతలు, దిగులూ భర్తనలా క్రుంగదీస్తున్నాయో ఆమెకు తెలుసు. అలా డీలా పడిపోతున్న భర్తకు నాలుగు మంచి మాటలతో ధైర్యం చెప్పాలని మనస్సులో వుంటుంది. బాదరబందీలతో కొండెక్కిపోతున్న ఆత్మవిశ్వాసాన్ని ఎగదోసేందుకు పరిస్థితులు ఏ మాత్రం ఊతం ఇవ్వటం లేదు.

భర్త దైన్యానికి మనస్సులోనే కుమిలిపోతున్న రాజమ్మ కన్నీళ్లు కంటిలోనే ఇంకిపోతున్నాయి.

"అప్పుడే లేవకపోతేనేం? కాసేపు పడుకోరాదూ?" లేచి ఇవతల కొచ్చి భర్త నుద్దేశించి అన్నది.

అమరయ్య భార్య మాటలకు తలెత్తి ఆమెకేసి చూశాడే గాని, ఉలకనూ పలకనూ లేదు. రాజమ్మ తలుపు తీసుకొని బయటకు నడిచింది.

వాకిలి ఊడ్చి, పేడ కళ్లాపి జల్లి, ముగ్గు వేసేసరికి తెల్లవారుతున్నది. ఒక్కొక్కరే నిద్రలేస్తున్నారు. తలోపనీ అందుకుంటున్నారు. కాస్త ఎండెక్కి గాని పిల్లలు లేవరు.

పెద్ద కొడుకు కావిడితో చెరువు నీళ్లు తెచ్చి పోస్తున్నాడు. అమరయ్య వాకిటి అరుగుమీద కూర్చుని కచ్చికతో పళ్లు తోముకొని, ముఖం కడుక్కున్నాడు.

వంటింట్లో పీట వాల్చుకుని చతికిలబడ్డ అమరయ్యను చూస్తూనే గ్రహించింది రాజమ్మ, భర్త పొలం వేళ్లే ఉద్దేశంలో ఉన్నాడని. వెళ్లే ముందు రెండు ముద్దలు చద్దన్నం తినటం మామూలుగా జరిగేది.

అలవాటు ప్రకారం భర్త ముందు కంచం, మంచినీళ్ల గ్లాసు వుంచింది. అన్నం పెట్టటానికి కుండ మూత తీసేసరికి ఆమె మనస్సు కలుక్కుమన్నది. గుప్పెడు మెతుకులన్నా లేవు.

నిద్ర లేస్తూనే ఆవురావురుమంటూ పిల్లలిద్దరూ గోలపెడ్తారు. ఆ ముద్ద తిని బడికి వెళ్తే తిరిగి పన్నెండు గంటలకే బడి నుండొచ్చేది. ఉన్న కాస్తా భర్తకు పెడితే వాళ్లను సముదాయించట మెలాగా?

మూడు రోజుల క్రితమే, డబ్బులు నిదానంగా ఇవ్వొచ్చు, ఎవరోకర్ని అడిగి ఒక బస్తా ధాన్యం ఆడించమని పెద్ద కొడుక్కి చెప్పింది.

చూస్తే మట్టికుండలో అడుగంటిన చిక్కని మజ్జిగ మాత్రం కనిపించాయి. అందులోనే రెండు గ్లాసుల నీళ్లు తొలిపి ఒక గ్లాసెడు మజ్జిగ అందించింది. మారు మాట్లాడకుండా అందుకున్నాడు.

"నిన్ననే బియ్యం నిండుకున్నాయి. అన్నం పిల్లలకే చాలీచాలకుండా వుంది. పెద్దోడు మూడ్రోజుల నుండి ఊరంతా తిరుగుతూనే ఉన్నాడు. అదిగో ఇదిగో అంటూ చిన్నయ్య ఒక బస్తా ఇచ్చాడట నిన్న సాయంత్రం. తీరా మిల్లుకు మోసుకెళ్లేసరికి కరెంటు పోనే పోయిందిట. పొద్దుటే ఆడించి ఇస్తాం రమ్మన్నారట" అమరయ్య అడక్కపోయినా చెప్పింది.

అమరయ్య మజ్జిగ నీళ్లు గొంతులో పోసుకుని గ్లాసు భార్య చేతి కందించి బయటకు నడిచాడు.

పెట్టిన కంచం పెట్టినట్లే తీయవలసి వచ్చినందుకు రాజమ్మ కళ్లలో నీరు ఉబికింది. నాలుగైదేళ్లుగా ఇబ్బందులు పడుతూనే వున్నప్పటికీ ఇంత దారుణం ఎన్నడూ లేదు.

పదేళ్ల క్రితం నాటి ఆ ఇంటి వైభవం ఒక్కసారిగా కళ్లముందు మెదిలింది.

సంవత్సరం పొడుగునా ఇల్లు పురులు నిండిన ధాన్యం వాసనతో నిండి వుండేది. పాలు, పెరుగుల వాసనతో వంటిల్లు గుప్పుమంటుండేది. పశువులమందతో కళకళలాడే దొడ్డంతా పేడ, పచ్చగడ్డి వాసనతో గిరికీలు కొడుతుండేది.

ఇప్పుడు ఆ పంటాలేదు, పాడీ లేదు. ఇల్లు, దొడ్డి అంతా ఒక్కటే మట్టికంపు.

* * *

ఊళ్లో రైతుల ముఖాలు చీడపట్టిన ఆకుల్లా వడలి వెలవెల బోతున్నాయి. ఏ కొమ్మ జూసినా, రెమ్మ జూసినా, పువ్వు జూసినా, కాయ జూసినా ఒకటే పురుగు. ప్రత్తి మొక్కలనిండా పుట్టల కొద్దీ పచ్చపురుగు. పురుగు పాటుకు బంగారం లాంటి పూత తెగి నేల రాలుతున్నది.

మూడేళ్ల బట్టి ఏ యేటి కాయేదు గట్టెక్కకపోతామా అన్న ఆశేగాని ఒడ్డున పడేదారి కనపట్టం లేదు. విత్తు నాటిన దగ్గర్నుంచి కాయ వలిచేదాక అన్నీ గండాలే. సకాలంలో వర్షాలుండవు. ఉన్నా దిగుబడి అంతంత మాత్రమే. దిగుబడి వున్నా "ఏటి ఈత లంకమేత' సామెతలా గిట్టుబాటుకాని ధరలు. అప్పోసప్పో చేసి పెట్టిన పెట్టుబడంతా సుడిగాలిలో దుమ్ములా కొట్టుకుపోవటమే. ఆదాయం ఉన్న రైతుగాని, అప్పుచేయని రైతుగాని ఊళ్లో లేడు.

ఈ ఏడాది పరిస్థితి మరీ అధ్వాన్నమైంది. వర్షం సరిగా లేక విత్తిన గింజ చచ్చి ఊరుకున్నది. మళ్లీ వర్షం జల్లుకు నాటిన గింజ మొలిచి మొక్క ఏపుగా ఎదిగి పూతమీద కొచ్చి కాపు మొదలయ్యేసరికి పంట పురుగు వాత పడింది. వందల కొద్దీ అప్పు చేసి పురుగు మందులు ఊపిరాడకుండా కొట్టారు. ఫలితం కనిపించలేదు.

అసలు అప్పు పుట్టక, ఒకవేళ ఆడవాళ్ల మెడల్లో పుస్తెలో, చేతి గాజులో తనఖా మీద పుట్టినా గిట్టదని రైతులంతా చేతులు ముడుచుకు కూర్చున్నారు. ఎకరానికి ఒకటి మహా అయిందనుకుంటే రెండు క్వింటాళ్ళు మించికాదని అంచనా వేసుకుని ఉసూరుమంటున్నారు.

ఉన్నట్టుండి అనూహ్యంగా రెట్టింపైన ప్రత్తి ధర రైతుల్లో అడుగంటిన ఆశను ఎగదోసింది. పురుగును అరికట్టి ఒకటో రెండో క్వింటాళ్లు అదనంగా పండించగలిగితే ఖర్చులు పోను పదో పరకో చేతి కందుతాయని ఆరాట పడసాగారు. ఆడవాళ్లు ఒంటిమీద ఇంకా మిగిలున్న బంగారం ఒలిచి అప్పు పుడ్తుందన్న చోటికల్లా ఎగబడ్డారు. అదీ లేనివాళ్లు తలలు తనఖా పెట్టి పురుగు మందుల కొట్లో ఖాతాలు తెరిచారు.

మందుల వ్యాపారస్తుల దశ తిరిగినట్లయింది. అదేపనిగా లారీల కొద్దీ పురుగు మందులు లోడు దించేస్తున్నారు. పూర్తి రొక్కానికే కొందరి కిస్తే, నమ్మకమనుకున్న వాళ్లకి పూర్తి అప్పులూ ఇస్తున్నారు. మరి కొందరికి కొంత రొక్కం కింద, కొంత అప్పుకింద సరఫరా చేస్తున్నారు.

ఒక్క సారిగా రైతుల్లో చైతన్యం వచ్చింది. ఇంటిల్లిపాదీ చీకటితోనే నిద్రలేచి స్ప్రేయర్లు భుజానేసుకుని మోయలేక మోస్తూ పొలాలకు పరిగెడుతున్నారు. మోటార్ల బరబరలతో ఆకాశం హోరెత్తిపోతున్నది. ఊరి పొలిమేరలు మందుల కంపుతో వెగటు పుట్టిస్తున్నాయి.

మందులకు పురుగు చస్తుందన్న నమ్మకం లేనివాళ్లు పురుగులు ఏరించేందుకు ఏకంగా కూలీలనే పెడుతున్నారు. వంద పురుగులు ఏరితే నాలుగు రూపాయలు. పిల్లా పీచని లేకుండా కూలి నాలి జనానికి ఎక్కడలేని గిరాకీ తగిలింది. మొక్కల మీద పిట్టల్లా పడి తలకొక వెయ్యి పురుగులు జమాయించి ఏరి పారేస్తున్నారు.

మందులు చల్లి పురుగులు ఏరించి ఇంతా శ్రమపడితే పంట ఏమాత్రం చేతికందుతుందనే దానిమీద ఎవరికీ సరైన అంచనా లేదు. ఇదంతా ఆశా – ఆరాటం – ప్రకృతితో పోరాటం!

అమరయ్య బ్రతుకు సాటిరైతులకు భిన్నంగా లేదు. అంతా ఒకే గూటి పక్షులు. ఉన్న కొద్దిపాటి వ్యత్యాసమల్లా పెద్దా చిన్నా రైతుల మధ్య పరిస్థితులకు నిభాయించు కోగలగటంలోనే వున్నది. పెద్దరైతు క్రుంగుతుంటే, చిన్న రైతు మరీ చితికి పోతున్నాడు.

నాలుగైదేళ్ల బట్టీ చేస్తున్న అప్పు వడ్డీలను జత చేసుకుని జీవితాన్ని కారుచిచ్చులా చుట్టేస్తున్నది. కాస్త పంట పండి ఆదాయం వచ్చిందనుకున్న ఏడాది పెద్ద కొడుకు పెళ్లి మాత్రం చేయగలిగాడు. కొడుకూ ఇద్దరు పిల్లల తండ్రయినాడు. కుటుంబం పెరిగింది.

కూతురు పెళ్లి కెదిగినా అప్పుల భయంతో ఏ యేటికాయేడు నెట్టుకొచ్చాడు. ఎంత కాలమని అలా వాయిదా వేయగలడు? వైశాఖ మాసం నాటికి డబ్బు చేతి కొస్తుందన్న ధైర్యంతో నిశ్చితార్థం చేసుకున్నారు. కూతురి పెళ్లని కాళ్లావేళ్లాపడి అప్పుల వాళ్ళకు కొంత జమచేసి, మిగిలిన దానితో ఎలాగోలా ఆ మూడు ముళ్లూ వేయించగలిగితే తన బాధ్యత తీరిపోతుందనుకున్నాడు.

డిగ్రీ దాకా చదువుకున్న చిన్న కొడుక్కి ఉద్యోగమూ రాలేదు, వ్యవసాయమూ చేతకాని వాడైనాడు. కొడుకు చదువు కోసమని ఖర్చుచేసినది మాత్రం తక్కువా?

పాత అప్పు దాని కదే పెరుగుతున్నది. దానికి తోడు వ్యవసాయ ఖర్చుల కోసం ప్రోనోట్లు రాసి, బంగారం కుదువబెట్టి ఈ ఏడాది మళ్లా అప్పు. అయిదెకరాల పొలం వుండీ ఇల్లు జరుగుబాటు కనాకష్టమై పోయింది.

ఊరిలో సాటిరైతుల హడావుడి గమనిస్తూనే వున్నాడు. నలుగురితోపాటు తనూ మందులు చల్లి పురుగును అదుపు చేస్తే నాలుగు డబ్బులు అదనంగా రావచ్చు. అందుకు పెట్టుబడి కావాలిగా?

ఉత్తినే కాళ్లూ చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చోలేక పొలం బయల్దేరాడేగాని నిజానికి వెళ్లి చేయాల్సిన పనీలేదు. దారి పొడుగునా పొలాల్లో హడావుడి కనిపిస్తూనే వున్నది. కొందరు మందులు చల్లుతున్నారు. కొందరు పురుగులు ఏరిస్తున్నారు.

చేనంతా కలయదిరిగాడు. ఏ మొక్క చూసినా లుకలుకలాడుతూ పచ్చ పురుగులు. సౌభాగ్యం మట్టి పాలవుతున్నట్లుగా పురుగు పాటుకు నేలరాలుతున్న పూత. పురుగు కాయను జల్లెడ కింద కొట్టిపారేస్తున్నది. పరిస్థితి ఇంత దారుణంగా వుంటే పంట ఏమాత్రం దక్కేను? ఎకరానికి మూడు వేల చొప్పున పురుగు మందులకే తగలేశాడు. పురుగూ చావలేదు, పూతా నిలవలేదు. తలచుకుంటున్న కొద్దీ అమరయ్య కళ్లు చెమ్మగిల్లాయి.

తన ఆశలను అన్ని విధాలా ధ్వంసం చేస్తున్న పురుగుల్ని చూస్తూ ఉత్తినే నిలబడలేక పోయాడు. మొక్కల మీదకు ఎగబడి ఒక్కో పురుగును పట్టి ఒడిలో వేసుకోసాగేడు. ఒక్కడే ఎన్ని పురుగులని ఏరగలడు? ఎన్నని చంపగలడు?

చేల మధ్య డొంకమీద వెళ్తున్న మోపెడు ఆగింది. ఆ శబ్దానికి అమరయ్యా తలెత్తి చూశాడు. కృష్ణమూర్తిని గుర్తించాడు. అతను స్టాండు వేసి గట్లమీదుగా లోపలకు రావటం చూసి తనూ మొక్కల మధ్య నుంచి గట్టు మీద కొచ్చాడు.

"చేను ఎలా ఉంది అమరయ్యగారు?" పలకరించాడు కృష్ణమూర్తి.

అమరయ్య అంతదాకా ఏరిన గుప్పెడు పురుగుల ముద్దను ఒడిలో నుంచి గుమ్మరించి చెప్పుతో కసపిసా నలుపుతూ, "ఇట్లా వుంది!" అన్నాడు నిరాశ ధ్వనిస్తున్న స్వరంతో.

"చాలవరకు అలానే ఉందిలెండీ. రేటు బాగానే వుంది. ఒకటి, రెండు క్వింటాళ్లు అదనంగా అయితే గిట్టుబాటు బాగుంటుంది. అంతా అదేపనిగా మందులు కొడ్తున్నారు. మీరూ కొట్టించక పోయారూ?" అన్నాడు.

"అవకాశం వున్నంత దాకా ఊడ్చి తెచ్చి పురుగులపాల బడేశాను. ఇంకా ఎక్కడ్నుంచి తెచ్చేది?" అన్నాడు నిట్టూరుస్తూ అమరయ్య.

కృష్ణమూర్తి రెండు నిమిషాలు ఆలోచించాడు.

"ఓ పని చేద్దాం. టౌన్‌లో నాకు తెలిసిన షాపతను వున్నాడు. నేనెంత చెప్తే అంత. అరువిప్పిస్తాను. పంటొచ్చినప్పుడు చూసుకుందాంలే" అన్నాడు కృష్ణమూర్తి భరోసాగా.

అమరయ్య వెంటనే అవునని గాని, కాదని గాని అనలేకపోయాడు. అప్పంటేనే గుండె దడపుడుతున్నది. అలాగని వదిలేస్తే పురుగు దెబ్బకు క్వింటాలన్నా చేతికి అందేటట్లు లేదు. ఎటూ వేలకు వేలు తగలేశాడు. ఇంతదాకా వచ్చి కాడికింద పారెయ్యడానికి మనసొప్పలేదు. అవసరాలు ఆశపెట్టాయి. ఆశ ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యమే సరే ననిపించింది.

"అలా పైకి వెళ్లి అరగంటలో తిరిగొస్తాను. నా బండి మీదనే టౌన్‌కెళ్దాం" అని చెప్పి తిరిగి బయల్దేరాడు కృష్ణమూర్తి.

ఒక గంట తరవాత ఇద్దరూ టౌన్‌కేసి బయల్దేరారు. ఆ ఊరికి టౌన్ మూడు కిలోమీటర్ల దూరం వుంటుంది. దారి పొడుగునా చేయబోతున్న అప్పు గురించి ఆలోచిస్తూనే వున్నాడు అమరయ్య.

కృష్ణమూర్తి ప్రత్తి వ్యాపారం చేస్తుంటాడు. చిల్లర మల్లరగా రైతుల దగ్గర ప్రత్తి కొని మూడు, నాలుగు కంపెనీలకు లోడు చేస్తుంటాడు. ఈ రకంగా అమ్మడం వల్ల రైతులకు క్వింటాలుకి పాతికో పరకో తక్కువే వస్తాయి. అయితే కాలు కదపనవసరం లేకుండా, సరుకెత్తిన వారం రోజుల్లో డబ్బు చేతి కందుతుందని నలుగురూ నమ్మకం మీద అతనికే సరుకు ఇస్తుంటారు.

కాటా వేయించడంలో కొద్దిపాటి తేడాలు, సరుకు అమ్మడంలో చూపే తెలివితేటలు, నలుగురూ అనుకునే దానికన్నా ఎక్కువే లాభిస్తాయన్న నిజం అతనొక్కడికే తెలుసు. భూమిని నమ్ముకున్న రైతు ఈ నాలుగేళ్లబట్టి అప్పుల్లో మునుగుతుంటే వ్యాపారాన్ని నమ్ముకున్న అతను వేల కొద్దీ ఆదాయంతో సౌఖ్యాల్లో తేలిపోతున్నాడు.

వెళ్లిన పని తొందరగానే అయింది. అయిదెకరాలకు రెండు సార్లుగా చల్లించేందుకు పది లీటర్ల మందు తీసుకున్నాడు. మొత్తం రెండు వేల నాలుగు వందల చిల్లరయింది.

రొక్కంగా కొంత పుచ్చుకొని రెండు వేల అయిదు వందలకు సరి సంఖ్యగా ఖాతా పుస్తకంలో వేలి ముద్ర వేశాడు. వేలికి సిరా పులుముకొని ముద్ర వొత్తుతుంటే చేయి వణికింది.

"హామీ నేను. పంట రావటమే ఆలస్యం. ఆయన తరపున నేను జమ చేస్తాను" కృష్ణమూర్తి ఫర్టిలైజర్ షాపు వాళ్లకు నమ్మకంగా చెప్పాడు. మందు డబ్బాలు పేక్ చేయించుకొని ఇద్దరూ బయటికొచ్చారు.

"కృష్ణమూర్తీ! సమయానికి దేవుడిలా ఆదుకున్నావయ్యా. ఏట్లో మునిగే వాణ్ణి ఒడ్డున పడేశావు" అన్నాడు అమరయ్య కృతజ్ఞతగా.

"మాట సాయం తప్పితే నే చేసిందేముంది లెండి" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

వేరే పని వుందంటూ కృష్ణమూర్తి తన దారిన తను వెళ్ళిపోయాడు.

అమరయ్య పురుగు మందుల పెట్టె నెత్తికెత్తుకున్నాడు. బస్‌స్టాండ్ దాకా రెండ్రూపాయలు రిక్షాకి పెట్టేందుకు మనసొప్పలేదు. అర్థగంటలో బస్‌స్టాండ్ చేరుకున్నాడు.

అప్పటికే మధ్యాహ్నం దాటింది. అమరయ్య చీకటి ముఖాన తాగిన గ్లాసెడు మజ్జిగ ఎప్పుడో ఇంకిపోయింది. ఆకలి నకనకలాడుతున్నది. ప్రాణం శోష కొచ్చినట్లున్నది. కాఫీ నీళ్లన్నా కడుపులో పడందే ఇంటికి చేరే ఓపిక రాదనిపించింది.

కాకా హెూటల్‌లో ముప్పావలా ఇచ్చి సింగిల్ కాపీ తాగేడు. ప్రాణం కాస్త కుదుటపడింది.

అంతలో బస్ రానే వచ్చింది.

చేజారిపోతున్న దనుకున్న పంట చేతి కందినంత ఆనందం అమరయ్యకు అప్పుడే కలిగింది. ఇప్పుడున్న రేటులో ఎకరాకి నాలుగు క్వింటాళ్లయినా, ఆదాయం సంగతెలా వున్నా పెట్టుబడికి దండగరాదు.

మందులు చూస్తూనే పెద్ద కొడుకు ఆశ్చర్యపడ్డాడు. "డబ్బెక్కడిది నాన్నా?" అడిగాడు

"అప్పుగా తెచ్చాన్లే. నలుగురితోపాటు మనమూ తెగించాలి" చెప్పాడు.

కొడుకు, రాజమ్మ మందు డబ్బాల కేసి బితుకు బితుకుమంటూ చూశారు.

అమరయ్యలో తిరిగి ఉత్తేజం పుంజుకుంటున్నది. చీకటితోనే రెండ్రోజులు ఇంటిల్లిపాదీ చేనుకు పరిగెత్తారు. ఒక విడత మందు జల్లటం పూర్తయింది.

మందు కలిపేటప్పుడు కొడుకు అనుమానపడ్డాడు.

"ఈ మందు సరైనదేనా నాన్నా?" అడిగాడు.

"కృష్ణమూర్తికి బాగా తెలిసిన కొట్లో ఇప్పిస్తేను. తేడా ఎందుకొస్తుందిలే?" అన్నాడు అమరయ్య.

"మందు అంత చిక్కగా వున్నట్లు లేదు. సరిగ్గా నీళ్లలో కలుస్తున్నట్లూ లేదు" అన్నాడు కొడుకు తనకున్న అనుభవం నుంచి.

"నీ ముఖం! అప్పిస్తే మాత్రం నాసిరకం సరుకిస్తారా?" అంటూ కొడుకు అనుమానాన్ని లెక్క చెయ్యలేదు.

అమరయ్య మర్నాడు చేనుకొచ్చాడు. అంతా కలయదిరిగాడు. పురుగు చావనట్లు అనిపించింది. కొడుకు మనస్సులో రేకెత్తించిన అనుమానం అలాంటి భ్రమకు గురి చేస్తున్నదేమో అనుకున్నాడు.

వరుసగా నాలుగు రోజులు చేనంతా పరిశీలిస్తూనే వున్నాడు. పురుగులు పూతను, కాయను కొరికేస్తూనే వున్నాయి. మందు జల్లినా ఫలితం ఏమాత్రం కనిపించటంలేదు. అప్పుడు గాని కొడుకు అనుమాన పడటంలో నిజం ఉందేమో అన్న సందేహం కలగలేదు.

కృష్ణమూర్తి కనిపిస్తే అడిగాడు. "ఆ షాపువాళ్లు చాలా నమ్మకస్తులు. అసలు ఇప్పుడు పుట్టే పురుగే అంత. ఓ పట్టాన చావటం లేదు" అన్నాడు.

రెండవసారి కూడా మందు కొట్టించాడు. పురుగు ఉధృతం ఏమాత్రం తగ్గలేదు. మందులో మోసం వుండే వుండాలి. లేకుంటే ఎక్కడి పురుగక్కడే చావకుండా ఇలానే వుంటుందా?

అమరయ్య ఈ విషయం తేలిగ్గా వదిలి పెట్టదలచలేదు. తను కొన్న మందులు మంచివో, కల్తీవో పరీక్ష చేయించాలనుకున్నాడు.

చదువుసంధ్యలు లేని తనలాటోడి గోడు ఈ ఆఫీసర్లు ఒక పట్టాన చెవినేసుకుంటారా? ఇదిగో అదిగో అంటూ మళ్లీ తొలకరి దాకా తిప్పుతూనే వుంటారు. చిన్న కొడుకు చదువుకున్న వాడు కాబట్టి, ఈ పని అప్పగిస్తే బావుంటుందనుకున్నాడు.

డబ్బాల్లో అడుగుబొడుగు మిగిలినది ఒక దాంట్లోకి వంచి అది కొడుకు చేతిలో పెట్టాడు.

"చిన్నోడా! ఇది కల్తీ మందని అనుమానం. టౌనుకి తీసికెళ్లి నిజం తెలుసుకు రావాలి. ఆ గొడవలన్నీ నాకు తెలవదు" అప్పగించాడు కొడుక్కి

కొడుకు టౌనుకి తిరిగినవాడు తిరిగినట్లే వున్నాడు. అమరయ్య కొడుకును రోజూ అడిగినవాడు అడిగినట్లే వున్నాడు. ఇదిగో అదిగో అంటుంటే కొడుకును కసురుకున్నాడు కూడా.

"గవర్నమెంటు ఆఫీసుల్లో పనంటే ఒక పట్టాన తెములుతుందా. ఎవడూ తీరిగ్గా వున్నట్లు కనిపించడు. ఏ పనీ జరగదు" అన్నాడు.

రోజూ పొలం వెళ్లి పంటను కొట్టిపారేస్తున్న పురుగును చూస్తూనే వున్నాడు. రోజు రోజుకూ సర్వనాశనం అయిపోతున్నది. ఏం చెయ్యటానికి కాళ్లు చేతులు ఆడటంలేదు.

చివరకు నిజం బయటపడింది.

"నాన్నా! మనల్ని షాపువాడు మోసం చేశాడు. ఆ మందు కల్తీదేనట. మనం రిపోర్టు రాసిస్తే వాళ్లమీద చర్య తీసుకుంటారట" చెప్పాడు చిన్న కొడుకు.

"ఏం చేస్తారు? వాలు కుదిరితే దొరికినంత మింగుతారు. లేకుంటే జైలో, జరిమానానో ఏస్తారు. అంతేనా! పడ్డ నష్టం ఎవడన్నా కడతాడంటావా?" అన్నాడు పెద్ద కొడుకు బాధగా.

అమరయ్య కొద్దిసేపు ఏం మాట్లాడలేకపోయాడు. అతనిలో ఆవేశం నిప్పులా రాజుకోసాగింది.

సరుకు కొన్న నష్టం దాదాపు రెండు వేల అయిదొందలు. కాని వాడు చేసిన మోసంవల్ల అయిదెకరాల పంట సర్వనాశనం అయింది. ఇంత నష్టం ఏ విధంగా పూడుతుంది? అప్పు కొంత తీరుతుందని, కూతురి పెళ్లి జరిగిపోతుందనీ ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు? పరువు, మర్యాద మంట గలవబోతున్నాయి. పరిస్థితులే బ్రతుకుల్ని రచ్చ కీడుస్తాయి.

కృష్ణమూర్తి ఎంత నమ్మకంగా చెప్పాడు? తడిగుడ్డతో గొంతులు కొయ్యటమంటే ఇదే కదూ? ఆ కొట్టువాడిచ్చే కమీషన్ డబ్బుకి కక్కుర్తిపడి బంగారంలాంటి పంటను పురుగుల నోటపెట్టాడు.

వానపాటుకు, పాముకాటుకు వెరవకుండా ఆరుగాలం కష్టపడే తన లాంటోళ్లకు దక్కుతుందేమిటి? కడుపులో ఆకలి, కంటినిండా నీళ్లు. ఏళ్ల తరబడి తమ బతుకుల్ని ఇట్లాంటి దళారీలకు, దగుల్బాజీలకు ఎరవేస్తూ మొసలి కన్నీరెడుతున్నారు. చావకుండానే తమ బ్రతుకుల్ని ఇలాంటి రాబందులు తన్నుకెళ్తుంటే పట్టించుకున్న దెవరు?

అమరయ్య గుండెలో ఆవేశం అగ్నిలా భగ్గుమంది. కళ్లు చింతనిప్పుల్లా మండు తున్నాయి. పిడికిళ్లు బిగుసుకున్నాయి. మహాశక్తిలా లేచి నిలబడ్డాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ టౌన్ కేసి బయల్దేరాడు.

అమరయ్య ఉగ్రనరసింహంలా తను పురుగు మందులు కొన్న కొట్టులోకి అడుగు పెట్టాడు. కృష్ణమూర్తి కూడా ఆ సమయానికి అక్కడే వున్నాడు.

"రొక్కానికి మంచి మందులు, అరువుకి కల్తీ మందులు ఇస్తారా మీరు?" కరుగ్గా అడిగాడు అమరయ్య.

కొట్టువాడు ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు. వెంటనే సర్దుకుని మేకపోతు గాంభీర్యంతో బుకాయించబోయాడు.

"నోటి కొచ్చినట్లు మాట్లాడకు. వెఱ్ఱికేకలు పెట్టటానికి ఇది మీ పశువుల దొడ్డికాదు" అన్నాడు బెదిరింపుగా.

అమరయ్యలో ఆవేశం కట్టలు తెంచుకున్నది. టేబుల్ రెండు చేతులతో ఎత్తి అతని మీదకు నెట్టాడు. అతను వెల్లకిలా పడ్డాడు. వారించబోయిన కృష్ణమూర్తి అమరయ్య చేతిదెబ్బకు రోడ్డుమీద కొచ్చి పడ్డాడు.

కొట్టు యజమాని, షాపు గుమాస్తాలు అమరయ్య మీద దౌర్జన్యానికి దిగారు. వాళ్ల దెబ్బల్ని లక్ష్య పెట్టటం లేదు అమరయ్య. అతని లక్ష్యమల్లా ఒక్కటే. తనలాంటి రైతుల కుటుంబాలు ఇలాంటి మోసగాళ్ల వల్ల బజారెక్క కూడదు. తగిన శాస్తి జరగాలి.

మందులు కొనటానికని అక్కడకు వచ్చి వున్న రైతులు పరిస్థితి అర్థం చేసుకుని అమరయ్యకు అండగా నిలిచారు. చేతులు కలిశాయి. తలలు పగిలాయి.

నిమిషాల్లో మందు డబ్బాలు రోడ్డు పాలయ్యాయి. కొట్టు ధ్వంసమైంది.

అంతలో వేగంగా పోలీసు వ్యాన్ వచ్చి కొట్టుముందు ఆగింది. పోలీసులు రైతుల్ని వలయంలా చుట్టుముట్టారు.

"రండిబాబూ! పురుగు చస్తే చాలు, మా పంట మాకు దక్కుతుందని భ్రమలో పడిపోయాం. వేలకు వేలు పురుగు మందుల కోసం తగలేస్తున్నాం. కాని కల్తీ మందులు అమ్మి రైతుల్ని మోసం చేసే ఇట్లాంటి పురుగుల్ని ఏరిపారేస్తేగాని మా బతుకులకు పట్టిన చీడ తొలగదయ్యా! మా మొక్కలకు పట్టిన పురుగుల్ని ఏరిపారేసేవాళ్లకు ఇంతని మేం కూలి డబ్బులిస్తున్నాం. మరి బతుకుల్ని కూలగొట్టే ఇట్లాంటి చీడపురుగుల్ని ఏరిపారేసేందుకు మీరంతా నాకు ఎంతిస్తారో చెప్పండయ్యా!" ఉద్రేకంతో ఊగిపోతూ అరుస్తున్న అమరయ్యను అడ్డుకోవడానికి ఆ క్షణంలో ఎవరికీ ధైర్యం చాలలేదు.

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13.07.1988)*